ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 19 ఆగస్టు 2025



కిసాన్ మేళా సభా ప్రాంగణం ఏర్పాటు

నేడు మెగా కిసాన్ మేళా

ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా వినుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం మెగా కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఈ కిసాన్ మేళాను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు రైతులతో కలిసి ట్రాక్టర్ల ర్యాలీ ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులు, యాంత్రీకరణ ప్రాధాన్యత తెలియజెప్పేలా ఈ సరికొత్త వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతుల సమస్యలకు వివిధ అంశాల్లో నిపుణులైన శాస్త్ర వేత్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి పరిష్కారాలు చూపిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం, పశు సంవర్ధక, పట్టు పరిశ్రమ, బిందు సేద్యం, ఉద్యాన తదితర శాఖలు, వివిధ రకాల ఆధునిక యంత్రాలు, ఎరువులు, బ్యాంక్ సేవలు, డ్రోన్‌లకు సంబంధించి 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.



హార్టికల్చర్ అధికారులు సిద్ధం చేస్తున్న పండ్ల మొక్కలు

కిసాన్ మేళాతో పాటు.. వినుకొండ, ఈపూరు ఏఎంసీల పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉండటంతో కూటమి నేతలు కిసాన్ మేళా కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సీఐ శోభన్‌బాబు తెలిపారు.

పీ-4.. పితలాటకం!

పట్టని ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం చెబుతున్నట్లుగా పీ-4 అమలు కావడం లేదని జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే అర్థమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రికపై.. ప్రజా ప్రతినిధులు అంతగా దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. ఒకరిద్దరు మినహా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించలేదంటే వారికి ఈ పథకం అమలు పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుంది.



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలులో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంను ప్రభుత్వం తీసు కొచ్చింది. వడపోతల అనంతరం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,85,223 బంగారు కుటుంబాలను నిర్ధారించారు. తొలి విడతలో మూడు జిల్లాల్లో 52,489 బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం నిర్వహించాలని అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కానీ, మార్గదర్శ కుల ఎంపికలో మాత్రం.. జిల్లాకు 4 వేల మందిని మాత్రమే ఎంపిక చేసి.. దత్తత కార్యక్రమంలో పీ-4 సార్థకత ఇదేనంటూ అధికారులు నిట్టూరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో 1,85,223 బంగారు కుటుంబాలు

- తొలి విడతలో 52,489 కుటుంబాల దత్తత
- జిల్లాకు 4 వేల మంది మార్గదర్శకుల గుర్తింపు
- స్వచ్ఛందంగా దత్తతకు ముందుకు రాని వైనం
- అసలు పట్టనట్లు ప్రజాప్రతినిధుల వ్యవహారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేర పీ-4 ముందుకు సాగుతున్న పరిస్థితి కానరావడం లేదు. ఎంపిక గడువు ముగిసినా అవసరం మేర మార్గదర్శకులు దొరకని పరిస్థితి నెలకొంది. మూడు జిల్లాల్లో అతి కష్టం మీద 12,695 మార్గదర్శకులను గుర్తించడంలో.. అధికార యంత్రాంగం నానా యాతన పడినట్లు తెలుస్తోంది. వీరందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారా లేదా అన్న చర్చ జరుగుతోంది. కొన్ని చోట్ల బలవంతంగా మార్గదర్శకులుగా మారుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య నామమాత్రమేనని సమాచారం. అధికారులు కొందరిని బలవంతంగా మార్గదర్శకులుగా నమోదు చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులపై ఒత్తిడి

ఒక్కో అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆగస్టు 15 కల్లా మార్గదర్శకుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే.

జిల్లాల వారీగా పథకం తీరు ఇలా..

పల్నాడు జిల్లాలో 79,068 బంగారు కుటుంబాల ఎంపిక జరిగింది. ఇందులో 2,14,225 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 52,308 కుటుంబాలను (మిగతా 7వ పేజీలో)

జగనన్న ముద్దు.. రజినీ మాకొద్దు!

- మాజీ మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి సమావేశం
- చిలకలూరిపేటలో నాయకత్వ మార్పునకు డిమాండ్

6



వైఆర్‌ఎస్‌హైస్కూల్ టీచర్లతో కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మురళీకృష్ణ

ఆంధ్రజ్యోతి కథనం ప్రేరణగా నిలిచింది

- వైఆర్‌ఎస్ హైస్కూల్‌కు ఎంతో చారిత్రక ప్రాధాన్యం
- కలెక్టర్ అరుణ్‌బాబు


రెంటచింతల,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'రెంటచింతలలో నడయాడిన గాంధీజీ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనం తనకు ఎంతో ప్రేరణ ఇచ్చిందని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. అదే రోజు పాఠశాల పూర్తి సమాచారాన్ని డీఈవో నుంచి తెప్పించుకున్నానని తెలిపారు. రెంటచింతలలోని వైఆర్‌ఎస్ హైస్కూల్‌ను కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు సోమవారం సందర్శించి పాఠశాలకున్న చారిత్రక నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు తరగతి గదులకెళ్లి ఉపాధ్యాయుడిలా మారిపోయారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టడానికి ప్రయత్నించారు. హిందీ, ఇంగ్లీషు గ్రామర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్సీ బాలుర, బాలికల వార్డెన్లను పిలిచి పాఠశాల అనంతరం.. ట్యూటర్లను నియమించుకుని విద్యార్థులతో పాఠ్యాంశాల పునశ్చరణ చేయించాలని చెప్పారు. ఇంతటి ప్రాధాన్యమున్న పాఠశాలను సందర్శించాలనే ఆలోచన.. తన మదిలో మూడు రోజుల నుంచి మెదలుతూనే ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాది టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్.అమర్‌కు కలెక్టర్ రూ.1116లను అందచేశారు. కరస్పాండెంట్ వైవీ సైదయ్య, బి.అప్పిరెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖరరావు, ఆర్డీవో మురళీ కృష్ణ, ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, తహసీల్దార్ మేరి కనకం, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల



- కలెక్టరేట్, వర్సిటీలో ఉద్యోగాలంటూ రూ.లక్షల్లో వసూళ్లు
- గుంటూరు నుంచి విశాఖ వరకు విస్తరించిన మాఫియా
- కీలకంగా డ్వామా మాజీ ఉద్యోగి..

'కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కేవలం రూ. 2 లక్షలు.. ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం రూ.లక్షన్నరే.. నోటి మాటతో నమ్మాల్సిన పని లేదండీ.. ఇదిగో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన అపాయింట్మెంట్ ఆర్డర్. మీకు ఇదే నేరుగా పోస్టులో వస్తుంది.' ఇదీ.. నిరుద్యోగులకు ఎరవేస్తున్న ఓ ముఠా తీరు.



ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేసినట్లు ఉన్న ఆధారం

మా నాన్న ఇంటికి రావొద్దంటున్నాడు..



మా నాన్న దివ్యాంగుడు. నాకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పు తెచ్చి రూ. 2 లక్షలు ఇచ్చాను. నన్ను మోసం చేశారు. అప్పు ఇచ్చిన వాళ్ల మా నాన్న ఇంట్లో అన్నం తింటుంటే బయటకు లాక్కొచ్చి కొట్టారు. మా నాన్న డబ్బులు తీసుకోకుండా ఇంటికి రావద్దు అంటున్నాడు. మొదట్లో ఎస్పీ చెప్పారని నగరంపాలెం పోలీసులు బాగానే స్పందించారు. మోసం చేసిన వ్యక్తిని పిలిపించి విచారించారు. ఈ నెల 10న డబ్బులు కడతానని ఒప్పుకున్న వ్యక్తి మళ్లీ స్పందించడం లేదు. చచ్చిపోవాలని ఉంది.

\- ఎ.చిరంజీవి, నర్సీపట్నం

గుంటూరు సిటీ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని కొందరు ఒక ముఠాగా ఏర్పడి.. నిరుద్యోగులకు కుచ్చు టోపీ పెడుతున్నారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతను మోసం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వలలో చిక్కిన నర్సీపట్నం యువకులు..

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన ఇద్దరు యువకులు చిరంజీవి, పూర్ణ ఉద్యోగం కోసం (మిగతా 6వ పేజీలో)

నరసరావుపేట వైసీపీలో ముసలం

పాదయాత్ర వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసిన వైసీపీ నేతలు

మాజీ మంత్రి అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు

- మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేయటం సిగ్గుచేటు
- డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ధ్వజం

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- ముగ్గురికి రూ. 30 వేలు జరిమానా విధించిన కోర్టు

పోలీసు నిఘాలో పట్టుబడ్డ 15 మంది గంజాయి ముఠా

భూకబ్జాలపై నివేదికివ్వండి

కలెక్టర్ అరుణ్‌బాబు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

6

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

గుంటూరు, పల్నాడులో 159 బార్ల లైసెన్స్‌లకు ఆహ్వానం

- గీత కార్మికులకు మరో 15 కేటాయింపు
- మూడేళ్ల కాలపరిమితి
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్ / నరసరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు జిల్లాలలో మొత్తం 159 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో 110, పల్నాడు జిల్లాలో 49 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, హైబ్రిడ్ మోడల్ మూడు విధానాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల కాల పరిమితికి.. ఒక వ్యక్తి ఎన్ని బార్ లైసెన్స్‌లకు అయినా.. దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బార్‌కి కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని స్పష్టం చేశారు. 50వేల లోపు జనాభా ఉంటే.. రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, అంతకు పైన జనాభా ఉంటే రూ.75 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటుందన్నారు. ఏడాదిలోగా ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు అన్నారు. ప్రతి దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు రూ.5.10 లక్షలు (మిగతా 6వ పేజీలో)



ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, అరుణ కుమారి, లతా



నీటి విడుదలను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు

విజయపురిసౌత్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్ట్‌ను సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీలించారు. ఎగువ నుంచి జలాశయానికి వచ్చే వరద ప్రవాహం గురించి ఇరిగేషన్ ఈఈ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రస్ట్ గేట్ల నుంచి విడుదలయ్యే వరద ప్రవాహాన్ని పరిశీలించారు. సాగర్‌కు వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, కుడి, ఎడమ కాలువలకు విడుదలయ్యే నీటి విడుదల గురించి కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళి, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, డ్యాం ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, కుడికాలువ గేట్స్ ఈఈ శ్రీకాంత్, డీఈ మురళీధర్, జేఈలు హిమబిందు, భారతి తదితరులు పాల్గొన్నారు.

మతలబు ఏమిటో?

- రూ.40కు ఇంటి నంబరు ప్లేటు
- వైసీపీ హయాంలో కాంట్రాక్టరుకు అనుమతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీల్లో ప్రతి ఇంటికీ.. రూ.40 చెల్లించి నంబరు ప్లేటు ఏర్పాటు చేయించుకోవాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ హయాంలో నంబరు ప్లేట్ల కాంట్రాక్ట్ ఇచ్చారు. దీనిని ఇప్పుడు అమలు చేస్తున్నారు. దీని వెనుక మతలబు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాటి కాంట్రాక్టర్‌కు ఇప్పుడు అనుమతులు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఎత్తున ము డుపులు చేతులు మారాయన్న విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ ప్రతినిధులు గ్రామాలకు వెళ్లి నంబరు ప్లేట్లు ఏర్పాటు చేస్తామని.. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను పంచాయతీల పాలకవర్గాలు.. కార్యదర్శులకు చూపిస్తున్నారు. కొన్ని చోట్ల ఈ తతంగాన్ని అడ్డుకుంటున్నారు. పంచాయతీల్లో చేపట్టిన ఇంటింటి సర్వే పూర్తి కాకుండా నంబరు ప్లేట్ల ఏర్పాటు ఏమిటని అధికారులను పాలక వర్గాలు నిల దీస్తున్నాయి.

సర్వే పూర్తికాకుండానే...

కేంద్ర ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేసే దానిలో భాగంగా స్వామిత్వ పేరుతో ఇంటింటి సర్వేకు ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రామాల వారీగా సర్వే చేపట్టింది. గ్రామంలో ఉన్న ఇళ్లు, స్థలాలను సర్వే చేస్తారు. ఇందుకు ఇంటి కొలతలు తీసేందుకు లీజు పద్ధతిలో రోవర్‌లను వాడుతున్నారు. పల్లెల్లో సర్వే ముమ్మరంగా జరుగుతోంది. సర్వే పూర్తి అనంతరం గృహ యజమానికి పట్టా తరహాలో శాశ్వత హక్కు ధ్రువ పత్రం అందజేస్తారు. ఈ ప్రక్రియ పూర్త యిన తర్వాత ఇంటి నంబరు ప్లేట్లు కేటాయి స్తారు. ఈ ప్రక్రియ జరుగుతుండగా ఆగమేఘాల మీద ఇంటి డోర్ నంబరు ప్లేట్ల వ్యవహారం తెరపైకి రావడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మొత్తం రూ.4 కోట్లు

పల్నాడు జిల్లాలో 4,34,399, బాపట్ల జిల్లాలో 3,64,788, గుంటూరు జిల్లాలో 2,33,717 గృహాలున్నాయి. మూడు జిల్లాల్లో 10,32,904 ఇళ్లు ఉన్నాయి. ఒక్కొక్క ఇంటికి రూ.40 చొప్పున వసూలు చేసుకునేందుకు పంచాయతీ రాజ్ శాఖ సదరు కాంట్రాక్టర్‌కు అనుమతి ఇచ్చింది. ఇలా రూ.4,13,16,160 వసూలు చేసుకునే అవకాశం ఏర్పడింది. సర్వే పూర్తయిన తర్వాత ఇంటి నంబర్లు కేటాయించనున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న డోర్ నెంబర్లు మారతాయని కార్యదర్శులు తెలిపారు. ఈ నేపథ్యంలో డోర్ నంబరు ప్లేట్లు ఏర్పాటు చేస్తే నిరుపయోగమేనని వారు చెబుతున్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు

పీ-4.. పితలాటకం!

(5వ పేజీ తరువాయి)

తొలి విడతలో దత్తత తీసుకునేలా నిర్ణయించారు. ఇందులో 27,760 కుటుంబాలను దత్తతకు 4,202 మంది మార్గదర్శకులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

- బాపట్ల జిల్లాలో 57,388 బంగారు కుటుంబాలను గుర్తించారు. 1,44,569 మంది కుటుంబ సభ్యులున్నారు. 49,151 బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ చేపట్టనున్నారు. వీటిలో 8,179 కుటుంబాలకు 4,212 మార్గదర్శకులను గుర్తించారు.

-గుంటూరు జిల్లాలో 1,00,314 బంగారు కుటుంబాలను గుర్తించగా వీటిలో 2,77,330 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. 83,764 కుటుంబాల దత్తతకు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా 16,550 కుటుంబాల దత్తత ప్రక్రియ ప్రారంభించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 4,281 మార్గదర్శకులను ఎంపిక చేశారు.

కొలువుల ఎర.. నిరుద్యోగులు విలవిల

(5వ పేజీ తరువాయి)

అక్కడ ఉన్న ఒక వ్యక్తిని కలిశారు. అతని సూచన మేరకు గుంటూరులోని ఓ వ్యక్తి దగ్గరకు వారు వచ్చారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చిరంజీవి వద్ద రూ. 2 లక్షలు, పూర్ణ వద్ద రూ. 1.70 లక్షలు అతను తీసుకున్నాడు. ఇదంతా ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. ఫోన్ పే ద్వారా నగదును బదిలీ చేశారు. గుంటూరు వ్యక్తి నగదు బదిలీ సమయంలోనే జాగ్రత్త వహించాడు. ఆ సొమ్మును బంగారం వ్యాపారికి బదిలీ చేయించాడు. కొంత మాత్రం తన ఖాతాతోపాటు, వాళ్ల సోదరి అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. నగదు తీసుకునే సమయంలో పది రోజుల్లోనే నియామకపు ఉత్తర్వులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ నియామక ఉత్తర్వులు

నిరుద్యోగులను నమ్మించడం కోసం ఈ ముఠా నకిలీ నియామక ఉత్తర్వులను తయారు చేసింది. అందులో గుంటూరు జాయింట్ కలెక్టర్ పేరు నిరుద్యోగులకు చూపించారు. జేసీ సంతకం దగ్గర మహిళా అధికారి పేరు ఉండడంతో.. అనుమానం వచ్చి ఇదేమిటి అని అడగగా.. మరొకరు కూడా అదే పోస్టులో ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేశారు. పది రోజుల్లో చిరునామాకు నియామకపు ఉత్తర్వులు వస్తాయని చెప్పినట్లు బాధితులు చెబుతున్నారు. ఉత్తర్వులు రాకపోవడంతో బాధితులు గుంటూరుకు చెందిన వ్యక్తికి ఫోన్ కాల్ చేయగా స్పందన లేదు. మోసపోయమని తెలుసుకున్న బాధితులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

వర్సిటీలో పరీక్ష కూడా పెట్టారు..

ఉద్యోగాల పేరుతో గుంటూరుకు చెందిన వ్యక్తి చాలా మందిని మోసం చేసినట్లు తెలుస్తోంది. మరొక మహిళ కూడా అదే వ్యక్తిపై ఈ మధ్య కాలంలో జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎన్‌జీ రంగా వర్సిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను ఏకంగా యూనివర్సిటీకి తీసుకెళ్లారు. కంప్యూటర్ పరీక్ష కూడా నిర్వహించినట్లు బాధితురాలు చెబుతోంది. దీంతో ఉద్యోగం సంగతి వాస్తవమేనని నమ్మి.. నగదు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ముఠా గుంటూరు, ఒంగోలు, విశాఖపట్నం జిల్లాల్లో ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు సమాచారం.

ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చు..

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలన్నారు. దరఖాస్తుదారుడికి వయసు కనీసం 21 ఏళ్లు ఉండాలి అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణకుమారి, సీఐ లత పాల్గొన్నారు.

గౌడ కార్మికులకు 15 బార్లు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గౌడ, గౌడ్ సంఘీలకు మొత్తం 15 షాపులు కేటాయించడం జరిగిందని గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా జేసీ భార్గవ్ తేజ, పల్నాడు కలెక్టరేట్లో అధికారులు గౌడ సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రాంతాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. గుంటూరులో 10 బార్లను కేటాయించగా..గౌడకు 7, గౌడ్‌కు మూడు షాపులు కేటాయించామన్నారు. పల్నాడు జిల్లాలో కేటాయించిన 5 షాపుల్లో గౌడకు 3, గౌడ్‌కు 2 షాపులు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ సామాజిక వర్గాలకు బార్ లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ బార్లకు ఏడాదికి లైసెన్సు ఫీజు రూ.55 లక్షలుగా ఉంది. ఏటా లైసెన్సు ఫీజును పెంచనున్నారు. రెండో ఏడాది రూ 60.50 లక్షలు, మూడవ ఏడాది రూ.66.55 లక్షలుగా లైసెన్సు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. పల్నాడు జిల్లాలో బార్ లైసెన్సులకు బుధవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు గెజిట్ విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఆయన కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న బార్లకు లాటరీ తీయనున్నారు.

పోలీసు నిఘాలో పట్టుబడ్డ 15 మంది గంజాయి ముఠా



పట్టుబడిన గంజాయి ముఠా సభ్యులతో డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల ప్రత్యేక నిఘాతో 15 మంది సభ్యులు గల రెండు గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు తెనాలి డీఎస్పీ బీ జనార్ధనరావు వెల్లడించారు. సోమవారం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టుబడిన ముఠాల వివరాలను వివరించారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో టీఆర్పీ చర్చి ప్రాంతంలోని ఖాళీ స్థలంలోని చెట్ల మధ్యలో గంజాయి ముఠా ఉందన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేసి 8 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. ఇందులో ప్రధాన నిందితుడు బిహార్ రాష్ట్రానికి చెంది ప్రస్తుతం పొన్నూరులో నివాసం ఉంటున్న మృత్యుంజయకుమార్ బీహార్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తెనాలి ప్రాంతంలో అత్యధిక ధరకు చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నాడు. ఇతని వద్ద గంజాయి కొనుగోలు చేసిన యువకులు తాము గంజాయికి బానిసలై ఆదాయం కోసం అమ్మకాలు చేపడుతున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుల్లో పట్టణ ప్రాంతానికి చెందిన కరికట్ట మధు, దాది షణ్ముఖ, పఠాన్ మహ్మద్ ఫరీద్‌ఖాన్, ఆకుల మారన్న, సయ్యద్ సైదా, ఆరెమళ్ల విజయ్‌కుమార్, నిమిది సంతోష్‌కుమార్‌లు ఉన్నారు. పోలీసులను చూసి పారిపోతున్న వీరిని వెంబడించి పట్టుకోవడంలో సాహసం చేసిన సీఐ రమేష్‌బాబు, సిబ్బంది పీ మురళి, డీ సురేష్, ఎస్ జైకర్, అబ్దుల్ సలాంను డీఎస్పీ అభినందించారు. నిందితుల నుంచి 1.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మరో గంజాయి కేసులో ఏడుగురు వ్యక్తులను రూరల్ సీఐ ఆర్ ఉమేష్ ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ ముఠాలో ఐదుగురు గంజాయి అమ్మకందారులతో పాటు ఇద్దరు గంజాయి తాగుతున్న వారిని కొల్లిపర డంపింగ్ యార్డు వద్ద ఉండగా అదుపులోకి తీసుకోవడం జరిగింది. వీరి నుంచి 1.600 కిలోల గంజాయి 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారిలో కృష్ణా జిల్లా బిల్లపాడుకు చెందిన పంది నాగయుగంధర్‌బాబు, కృష్ణా జిల్లా గుడివాడ ముబారక్ సెంటర్‌కు చెందిన షేక్ రకీబ్, గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన పాత నేరస్తుడు రామిశెట్టి శ్యాం, ఇదే గ్రామానికి చెంది గతంలో రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న దుగునూరి మోహన్‌తేజ, 16 దొంగతనాల కేసులో నిందితుడిగా ఉన్న కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కనపర్తి సుందరరావు, పోలీసుల దాడి సమయంలో గంజాయి సేవిస్తున్న షేక్ అబ్దుల్ కరీమ్, తూములూరుకు చెందిన విష్ణుమొలకల భరత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచడం జరిగిందని డీఎస్పీ వెల్లడించారు. ఈ ముఠాని అదుపులోకి తీసుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన తెనాలి రూరల్ సీఐ ఆర్ ఉమేష్, కొల్లిపర సీఐ పీ కోటేశ్వరరావు, సిబ్బంది పోతురాజు, రామకోటేశ్వరరావు, మురళి, నాంచారయ్య, రమేష్, నాగబాబు, నాగరాజులను డీఎస్పీ బీ జనార్ధనరావు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థుల క్రమశిక్షణే ఉన్నత శిఖరాలకు బాట

చైర్మన్ కోయ సుబ్బారావు



విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు

వట్టిచెరుకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను విద్యతో పాటు క్రమశిక్షణే వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు అన్నారు. సోమవారం బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిట్స్ కళాశాల ప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ నిష్ణాతులైన ఫ్యాకల్టీ అధ్యాపకుల బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణకు తమ కళాశాల ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అందువల్లనే సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు తమ కళాశాలను ఎంచుకోవ టమే అందుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు మంచి ఉపాధి అవకా శాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను నిపుణులైన అధ్యాపకులు అందించటం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల్లో సృజనా త్మకతను వెలికి తీయడానికి వివిధ రకాల ఇన్నోవేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తమ కళాశాలలోని విద్యార్థులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కాకుండా స్వయంగా కంపెనీలు స్థాపించేందుకు అవసరమైన నైపుణ్యాలను వివిధ స్టార్టప్ కంపెనీల సహకారం అందిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరి కోయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక అంశాలపై ఎక్కువ అధ్యయనం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు విద్యార్థులకు వారి కోర్సుల వివరాలను, పరీక్షల విధానం, శిక్షణ తరగతుల నిర్వహణ తదితర అంశాలను వివరించారు.

మాజీ మంత్రి అంబటిపై ఎస్పీకి ఫిర్యాదు

● మార్ఫింగ్ వీడియోలు పోస్ట్ చేయటం సిగ్గుచేటు ● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ధ్వజం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2023లో జరిగిన ఎన్నికల వీడియోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో మాజీ మంత్రి అంబటి రాంబాబు పోస్ట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హరిబాబు మీడియాతో మాట్లాడుతూ ఎక్కడో జరిగిన వీడియోలను మార్ఫింగ్ చేసి పులివెందుల ఉప ఎన్నికలంటూ దుష్ప్రచారం చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్మోహన్ రెడ్డి అండ్ కో బ్యాచ్ తీరు మారలేదని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పెట్టి టీడీపీపై బురదజల్లడమే వైసీపీ నేతలు ధ్యేయంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఫేక్ వీడియోలు, ఫేక్ వార్తలు ప్రసారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం పరిపాటిగా మారిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి బ్యాచ్ క్షుద్ర రాజకీయాలు మానుకోకపోతే పోతే రాబోయే రోజుల్లో శ్రీకృష్ణ జన్మస్థానంలో కూర్చోవడం అంబటి రాంబాబుకి కూడా తప్పదని హెచ్చరించారు.



మార్ఫింగ్ వీడియోలను మీడియాకు చూపుతున్న వడ్రాణం హరిబాబు

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

● 9 బైకులు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు అలవాటుపడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వారి వివరాలను వెల్లడించారు. కొల్లూరు మండలం సుగ్గురులంక, కొల్లిపర మండలం గౌడపాలెం, అన్నవరంగౌడపాలేనికి చెందిన ఈ ముగ్గురూ.. మైనర్లేనన్నారు. వీరివద్ద నుంచి 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.9.60 లక్షలన్నారు. వీరిపై జిల్లాలోని రేపల్లె, వేమూరు, మంగళగిరి, తాడేపల్లి, చందోలు, చెరుకుపల్లి, చిలకలూరిపేట, నిజాంపట్నం, పోలీస్ స్టేషన్‌లలో కేసులు ఉన్నాయన్నారు. రేపల్లెటౌన్ సీఐ మల్లికార్జునరావు, రేపల్లెలో బైక్ దొంగతనం కేసు నమోదు అవడంతో.. అధునాతన టెక్నాలజీ ఉపయోగించి ఈ ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లికార్జున్‌రావు, ఎస్‌ఐ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

● రూ. 30 వేలు జరిమానా విధించిన కోర్టు

తాడికొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి భారీ జరిమానాలను మంగళగిరి కోర్టు జడ్జి విధించారు. ఆదివారం తాడికొండ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో ముగ్గురు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి సోమవారం మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. మద్యం సేవించి వాహనం నడిపినందుకు ఒక్కొక్క వాహనదారుడికి రూ. 10 వేల చొప్పున ముగ్గురికి కలిపి రూ. 30 వేలు జరిమానాను జడ్జి విధించారు.

భూకబ్జాలపై నివేదికివ్వండి : కలెక్టర్

గురజాలటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో భూకబ్జాలపై త్వరగా నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై నివేదిక ఇవ్వాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవినీతికి తావు లేకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణబాబు

జగనన్న ముద్దు.. రజినీ మాకొద్దు!

● మాజీ మంత్రికి వ్యతిరేకంగా అసమ్మతి సమావేశం ● చిలకలూరిపేటలో నాయకత్వ మార్పునకు డిమాండ్

చిలకలూరిపేట, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జగనన్నే ముద్దు, రజినీ మాకొద్దు అని ప్లకార్డులు చేతబూని నినదిస్తూ మాజీ మంత్రి విడదల రజినీకి వ్యతిరేకంగా ఆదివారం రాత్రి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైసీపీలోని ఒక వర్గం వారు సభ నిర్వహిం చారు. మాజీ మంత్రి రజినీ అరాచకాలు, అవినీతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బి.చిన్న మాట్లాడుతూ చిలకలూరిపేటలో రజిని నాయకత్వంలో తాము పనిచే యబోమని స్పష్టం చేశారు. తామంతా పార్టీ ఉన్నతి కోసం కృషి చేస్తా మని, నాయకత్వ మార్పు చేయాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు. పీఏలను అడ్డంపెట్టుకుని దోచుకోవటమే లక్ష్యంగా రజిని అరాచకం సాగిందని, అక్రమంగా సంపాదించడం తప్ప రజిని చేసింది ఏమీ లేదని విమర్శించారు. ఐదు సంవత్సరాల్లో ఆమె చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కాదని, సొంత పార్టీ వారిపైనే అనేక అక్రమ కేసులు పెట్టించారన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, బైపాస్ రోడ్డు కాంట్రాక్టర్లు, ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టర్లు, మైనింగ్, భూదందాలు, కరోనా సమ యంలో పలు ఆస్పత్రుల వారి నుంచి అక్రమ వసూళ్లు, విద్యుత్ శాఖ లో ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన చరిత్ర రజినీదన్నారు.



సభలో పాల్గొన్న వైసీపీ అసమతి వర్గం నాయకులు

గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలికంగా కొండపల్లిలో స్టాపేజ్ తొలగింపు

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన రాకపోకలు సాగించే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు కొండపల్లి రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా నిలుపుదల సౌకర్యాన్ని తొలగించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలుకు అక్టోబరు 19 నుంచి నవంబరు 18వ తేదీ వరకు కొండపల్లిలో నిలుపుదల ఉండదన్నారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి నాయుడుపేటలో స్టాపేజ్ సదుపాయం

నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి ఈ నెల 19వ తేదీ నుంచి నాయుడుపేటలో నిలుపుదల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు.ఈ రైలు నాయుడుపేటకు వేకువజామున 3.03కు చేరుకొని 3.05కి బయలుదేరి వెళుతుంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సింగంపల్లి పున్నారెడ్డి (ఫైల్ ఫొటో)

క్రోసూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరుకు చెందిన సింగంపల్లి పున్నారెడ్డి(55) అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పున్నారెడ్డి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి కన్పించకుండా పోయాడని, సోమవారం ఉదయం వేల్పూరు శివారులోని పొలాల్లో మృతదేహం లభ్యమైందని తెలియ జేశారు. పొలం పనుల కోసం వెళ్ళిన స్థానికులు పున్నారెడ్డి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. పున్నారెడ్డి తనకు ఉన్న కొద్దిపాటి పొలంతో పాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవాడని, వ్యవసాయం కలసి రాక అప్పుల బాధ ఎక్కువై బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిపారు. రూ. 10లక్షల వరకు పున్నారెడ్డికి అప్పులు ఉన్నట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పున్నారెడ్డి మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలియ జేశారు.

సత్తెనపల్లిలో ఏటీఎం కార్డుతో మోసం

సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రిటైర్డు ఉద్యోగి వెల్లటూరి సుబ్బారావు సోమవారం పాత బస్టాండ్ సమీపంలోని ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు వెళ్ళాడు. అక్కడే ఉన్న ఓ యువకుడు సాయం చేస్తానంటూ నమ్మ బలికి ఆయన ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం ఆ యువకుడు సుబ్బారావు ఏటీఎం కార్డు తీసుకొని వేర్వేరు ఏటీఎం కేంద్రాల నుంచి రూ 30వేలు వరకు నగదు డ్రా చేశాడు. సుబ్బారావు ఫోన్‌కు నగదు డ్రాకు సంబంధించిన సమాచారం వచ్చింది. దీంతో తాను మోస పోయాయని గుర్తించిన సుబ్బారావు పట్టణ పోలీసులు ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట వైసీపీలో ముసలం

పాదయాత్ర వెంకటేశ్వర్ రెడ్డిపై దాడి చేసిన వైసీపీ నేతలు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెంలో వైసీపీ నేతల మధ్య ఆధిపత్య పోరు ఘర్షణకు దారితీసింది. గ్రామంలోని వైసీపీ నాయకుడు పాదయాత్ర వెంకటేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి తనపై అదే గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. గ్రామంలో జరిగిన జగనన్న కాలనీ ఇళ్ల పట్టాలు, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణంలో రూ.3కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నిర్మించిన కళ్యాణ మండపం అద్దె వసూలు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదానికి దారితీసింది. దాడిలో పాదయాత్ర వెంకటేశ్వర్‌రెడ్డికి తీవ్రంగా గాయాలు కావడంతో నరసరావుపేట ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. రంగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తనపై దాడి చేశారని నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

42,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,541 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,059 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13200
273	----	----
341	10000	14600
4884	---	---
సూపర్ 10	10000	13200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	13000
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	9800	11200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13600
నెంబరు. 5	10000	13500
273	---	---
341	11000	14800
4884	10000	12800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200
బ్యాడిగి 355	10000	13100
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7200

బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు

పెదకూరపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ మెసేజ్‌లు పెడుతున్న వ్యక్తిపై మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గిరిబాబు సోమవారం తెలిపారు. మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన ఎం చరణ్ తేజ అనే బాలుడు వెంటపడి వేధిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



మాచవరంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పసుపులేటి పూర్ణయ్య తదితరులు

సొసైటీ అభివృద్ధికి పాటు పడతా

● చైర్‌పర్సన్ పుసుపులేటి

మాచవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మాచవరం సొసైటీ అభివృద్ధికి అందరినీ కలుపుకొని కృషి చేస్తానని నూతన చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పసుపులేటి పూర్ణయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్‌పర్సన్‌గా పసుపులేటి పూర్ణయ్యచే చీఫ్ మేనేజర్ రఫీ ప్రమాణం చేయించారు. పర్సన్స్‌గా బూరె సైదా, బాణావత్ కోటేశ్వరనాయక్‌లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పూర్ణయ్య మాట్లాడుతూ రైతులకు రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమానికి సూపర్‌వైజర్‌గా వెంకయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ గొల్లపల్లి గోపీ, పిడుగురాళ్ళ మార్కెట్‌యార్డు చైర్మన్ టి.వీరాస్వామి, మండలంలోని కూటమినాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా జనార్ధనరావు



జనార్ధనరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా పిడుగురాళ్లకు చెందిన ఆవుల జనార్ధనరావు ఎన్నికయ్యారు. సోమవారం ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వీడీ పి.నరసింహారెడ్డి, శ్రీకాకుళం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్‌పర్సన్ రమణబాబు, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ సామంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో పిడుగురాళ్ల స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్ధనరావు ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం జనార్ధనరావుకు అభినందనలు తెలిపారు.

కూటమి నేతల పరామర్శ

పిడుగురాళ్ల, ఆగస్టు 18(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని 12వ వార్డుకు చెందిన కాండ్రగుంట శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు స్థానిక కూటమి నేతలు సోమవారం శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి మృతుని భార్యకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కలిసినవారిలో కూటమి నేతలు పాండురంగ శ్రీను, ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, జనసేన మండల కన్వీనర్ కామిశెట్టి రమేష్, పణితి రవి, నెకరికంటి శివ, వల్లెపు రామకృష్ణ, మొగిలి కొండలు, కార్ సైదా, వర్ల రత్నం, బిజిలి వెంకట్రావు, బత్తుల చినవెంకటేశ్వర్లు, కుంచపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

పదవుల కేటాయింపులో సామాజిక సమతూకం

● కష్టకాలంలో జెండా పట్టిన ప్రతి కార్యకర్తకు న్యాయం ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పార్టీ సంస్థాగత పదవుల్లో వారికి తగు ప్రాధాన్యత ఇచ్చి గౌరవిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మండలంలోని పాతపాలువాయి గ్రామంలో ఓ వేడుకలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే నేతలు, కార్యకర్తల కృషివల్లనే తనకు భారీ మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. ఉచిత ప్రయాణం అతివలకు వరం లాంటిదని, అన్నదాత సుఖీభవతో వేలాది రైతు కుటుంబాలకు ఆర్థిక చేయూతను సీఎం చంద్రబాబు కల్పించారన్నారు. తుమ్మకోటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండలపు హనిమిరెడ్డి, లింగా మాధవ్‌రావులు కోరగా డీఎంతో ఫోన్లో మాట్లాడారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, శౌంరిరెడ్డి నాగమ్మనర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్ అల్లం నాగలక్ష్మి, మండలపు హనిమిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి, శౌరెడ్డి, ప్రభురాజ్, కోటేశ్వరరావు, నరేంద్ర తదితరులున్నారు.

ప్రభుత్వ హామీలకు పూర్తిస్థాయిలో కార్యరూపం

మాచర్లటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ మంత్రులు ఇచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో కార్యరూప దాల్చుతున్నాయని ప్రభుత్వ హామీల కమిటీసభ్యుడు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ కమిటి సమావేశ మందిరంలో ప్రభుత్వ హామీల కమిటి చైర్మన్ కామినేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. శాసనసభలో మంత్రులు అభివృద్ధి పనులపై ప్రజలకిచ్చిన హామీలు, వాగ్దానాలపై తయారు చేసిన ప్రణాళికలపై చర్చించినట్లు చెప్పారు. అభివృద్ధే ధ్యేయంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ఇచ్చిన ప్రతి హామీ అమలు అవుతుందన్నారు. ఇప్పటికే హామీల్లో దాదాపు 90శాతంకు పైగా అమలయ్యాయన్నారు. ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక వసతులు, మానవ వనరుల కల్పనలో సింహభాగం నిధులు ఖర్చుచేస్తోందని చెప్పారు.

ర్యాలీకి తరలివచ్చిన రైతులకు ధన్యవాదాలు

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీకి పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేసిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపేందుకు గత ఆదివారం మాచర్లలో రైతులతో నిర్వహించిన ట్రాక్టర్స్ ర్యాలీలో దాదాపు 500 ట్రాక్టర్లతో రైతులు పోటెత్తారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి ఎన్నికల హామీలను సీఎం నెరవేరుస్తున్నారన్నారు.



పెదమద్దూరు వాగు వద్ద రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణాకాంత్ రెడ్డి

నదీతీర గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఎగువ నుండి సుమారు 7లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తుందని నదీతీర గ్రామాలలో రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆర్‌డీఓ రమణాకాంత్‌రెడ్డి మండల రెవిన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాలలో పర్యటించి వైకుంఠపురం కరకట్ట, పెదమద్దూరు వాగుపై చప్టాను పరిశీలించారు. నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, నది, వాగులవద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఆర్ఐలను ఆదేశించారు.

విద్యార్థుల కోసం వేస్తే వరదకు కొట్టుకుపోయింది..

అమరావతి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సుమారు వందమంది విద్యార్థులు 3కి.మీ. నడిచి హైస్కూల్‌కు వెళ్లేందుకు రూ2.5కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు ఐదు రోజుల క్రితం వచ్చిన భారీ వరదలకు గండ్లు పండి కొట్టుకుపోయింది మండలంలోని నెమలికల్లు-మండెపూడి గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి ఇది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రూ2.5కోట్ల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో మండెపూడి హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మించి మూడు నెలల క్రితం వారికి నెమలికల్లు నుండి మండెపూడికి బస్సును కూడా ఏర్పాటు చేయించారు. రెండు గ్రామాల ప్రజల వ్యవసాయ పనులకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా ఉంది. వరద ఉధృతికి రహదారి కోతలు పడటం, మధ్యలో నిర్మించిన చప్టాకు ఇరువైపుల గండిపడటంతో సోమవారం పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు బస్సు వెళ్లకపోడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రహదారి తక్షణం మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.





నెమలికల్లు-మండెపూడి రహదారికి గండ్లు పడిన దృశ్యం

అండర్-15 వాలీబాల్ పోటీల్లో జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

పెదకూరపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో సోమవారం జరిగిన నేషనల్ అండర్-15 విభాగంలో బాలబాలికలకు జరిగిన వాలీబాల్ పోటీల్లో పెదకూరపాడుకు చెందిన జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్యస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ డైరెక్టర్ కవిత రాము సోమవారం తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ బాలుర విభాగంలో డీ బ్రహ్మం, బాలికల విభాగంలో సాధినేని నేహ ఎంపికయ్యారన్నారు. ఈనెల 28న పూణేలో జరిగే ఇండియా లెవల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవాలు

నకరికల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంటలో బొడ్డురాయి ప్రతిష్ఠించి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా సోమవారం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బొడ్డురాయికి ప్రత్యేకపూజలు చేశారు. వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎస్ఐసురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నీలకంఠేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభానికి పూజలు

నకరికల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలోని గంగా పార్వతి సమేత నీల కంఠేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించేందుకు ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడంను సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా దేవాలయానికి తీసుకు వచ్చారు. ఇత్తడి తాపడంను గడిపూడి బాబు బహూకరించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. చోళుల కాలంలో నిర్మించిన ఈ పురాతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు.

పీహెచ్‌సీ కిటికీలను పగలగొట్టిన ఆకతాయిలు

నకరికల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కుంకలగుంటలోని పీహెచ్‌సీ కిటికీని ఆదివారం ఆయితాయిలు పగలగొట్టారు. రాళ్ళు విసరటంతో కిటికీ అద్దాలు పగిలి ఆస్పత్రిలోని బెడ్‌ల పైన పడ్డాయి. ప్రభుత్వ ఆస్తులను నష్టపరిచే వారిపట్ల పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కరాటేలో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ ఒంగోలు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియా కరాటే స్కూల్ విద్యార్థులు 22 మంది కతా విభాగం, వ్యక్తిగత బాలుర కతా విభాగంలో ప్రతిభచూపి సర్టిఫికెట్లు పొందారని కరాటే మాస్టర్ ఏ రామయ్య సోమవారం విలేకరులకు తెలిపారు.

ఆనంద్ కుమార్‌కు సన్మానం

సత్తెనపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ నుంచి ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న మునిసిపల్ కమిషనర్ ఎన్ ఆనంద్‌కుమార్‌ను సోమవారం అభ్యుదయ విజ్ఞానసేవాసమితి అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీ శ్రీనివాసరావు, కే బుజ్జి, పీ ఆంజనేయులు, నరసింహారావు, ఖాజావలి పాల్గొన్నారు.

లక్షలు ఖర్చు చేసినా నిరుపయోగం

● విద్యార్థులకు వాటర్ బాటిళ్ళే దిక్కు
● ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్ల దుస్థితి





దాచేపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిరుయోగంగా ఉన్న నీటిశుద్ధి ప్లాంట్

దాచేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు ఖర్చుచేసి ప్రభుత్వపాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్(నీటి శుద్ధి యంత్రాలు)లు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. ఆలనాపాలన లేక పనికి రాకుండా పోయాయి. దాచేపల్లి మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 45 ఉన్నాయి. వీటితోపాటు ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. అయా పాఠశాలల్లో 5,600మందికి పైగా విద్యాభ్యాసం చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నారు. వారికి శుద్ధి చేసిన తాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటుచేశారు. పల్నాడు ప్రాంతంలో నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉంది. ఈ సమస్యకు పరిష్కార దిశగా ప్రభుత్వ అయా పాఠశాలల్లో రూ.292లక్షల నిధులు మంజూరుచేసి ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటుచేసింది. కానీ నిర్వహణ సక్రమంగా లేక ఫిల్టర్‌చేసే పరికరాలన్నీ తుప్పు పట్టి మరమ్మతులకు గురయ్యాయి. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం, దాతలు స్పందించి మరమ్మతులు చేసి ఆర్‌వో ప్లాంట్లను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే



దొడ్లేరులో సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

క్రోసూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతమైన మండలంలోని దొడ్లేరులో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. జ్వరాలు, ఇతర అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నట్టు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ తెలిపారు. కలెక్టర్, డీఎంహెచ్‌వో సూచనల మేరకు మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయించామని, దోమలు ప్రబలకుండా సూచనలు చేశామన్నారు. ఇటీవల దొడ్లేరులో వరద వచ్చి గృహాల్లోకి నీరుచేరిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ స్థానికులను అప్రమత్తం చేసినట్టు తెలిపారు. సర్వేలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌వీఎన్ కాలనీ మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

సత్తెనపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీ మీదుగా గుంటూరు బస్టాండ్ వరకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ సోమవారం తెలిపారు. సత్తెనపల్లి నుంచి ఉదయం 6 గంటలు, 7:25, 8:50, 10:15, 11:40, మధ్యాహ్నం 1:40, 2:40, సాయంత్రం 4, 5, 5:30, 6:55 గంటలకు ఎస్‌వీఎన్ కాలనీ మీదుగా గుంటూరుకు బస్సులు వెళ్తాయని తెలిపారు. గుంటూరు నుంచి ఎస్‌వీఎన్ కాలనీ మీదుగా సత్తెనపల్లికి ఉదయం 7:25 గంటలు, 8:50, 10:15, 11:40, మధ్యాహ్నం 1:05, 2:40, సాయంత్రం 4:05, 5:30, 7:00, 8:15 గంటలకు బస్సు సర్వీసులు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో వీఏఏలు, వీహెచ్‌ఏల భాగస్వామ్యం తప్పనిసరి

ముప్పాళ్ళ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో వీఏఏలు, వీహెచ్‌ఏల భాగస్వామ్యం తప్పనిసరని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి అన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ లాబ్‌లో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్‌ఏలు రైతుల వద్దకు వెళ్ళి వారు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ వ్యవసాయం వలన భూమి ఆరోగ్యంతోపాటు ఆరోగ్య కర, నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. భవిష్యత్తు తరాలకు పర్యావరణాన్ని కాపాడగలిగే శక్తి ప్రకృతి వ్యవసాయానికి ఉందన్నారు. మూడు రోజులపాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ రామచంద్రరావు, ఏడీఏ రవిబాబు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ, పెదకూరపాడు ఏఓలు, జిల్లా ట్రైనర్ సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, డివిజన్ ఎంసీ మధుబాబు, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళులు

దుర్గి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దుర్గి బీజేపీ కార్యాలయంలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్‌చంద్రబోస్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి, టి.రాణి, చిట్టే రమణ, డి.లక్ష్మి, ఉప్పు దుర్గ, వి.భూలక్ష్మి, సింగు రమణ, మణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన అమరేసు కళావతి అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు మంజూరైన రూ.1,57,285 సోమవారం గ్రామ సచివాలయంలో టీడీపీ నేత జగడాల శ్రీను, కళావతి భర్త అంకారావుకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల దాడులు

● చౌర్యానికి పాల్పడుతున్న వారికి అపరాధ రుసుం విధింపు

ముప్పాళ్ళ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ఆ శాఖ విజిలెన్స్ అధికారులు అన్నారు. మండలంలోని దమ్మాలపాడు, ఇరుకుపాలెం, బొల్లవరం, గోళ్ళపాడు, తురకపాలెం, చాగంటివారిపాలెం, రుద్రవరం, తొండపి గ్రామాలలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం బృందం సోమవారం తనిఖీలు నిర్వహించారు. 120మంది సిబ్బంది 40 బృందాలుగా ఏర్పడి 2659 సర్వీసులను పరిశీలించారు. మీటర్లు లేకుండా విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న 8మందికి రూ.13వేలు, మీటరు ఉండి చౌర్యానికి పాల్పడుతున్న 10మందికి రూ.లక్షా 55వేలు, అనుమతి లేని కేటగిరిలో విద్యుత్తును వాడుకుంటున్న ఐదుగురికి రూ.20వేలు, అదనంగా లోడు వాడుతున్న 114 మందికి రూ.4లక్షల 60వేల అపరాధరుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటరుకు సీలు తప్పని సరిగా ఉండాలన్నారు. విద్యుత్ చౌర్యం చేసిన వారికి మొదటిసారి అపరాధ రుసుం విధిస్తామని, అదే తప్పు రెండోసారి చేస్తే అరెస్టు చేసి రిమాండుకు పంపుతామన్నారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడేవారి వివరాలను 9440812263 నంబర్‌కు తెలపాలని ప్రజలను కోరారు. దాడులలో డీఈఈలు కె.రవికుమార్, ఎన్ మల్లికార్జున ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు, ఏఈలు కె కోటేశ్వరరావు, ఎం.సతీష్ కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ జి.సుచరిత పాల్గొన్నారు.

పులిచింతలకు 2,92,192 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 16 రేడియల్ క్రస్ట్‌గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,92,192 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యలు చెప్పారు. ఎగువన సాగర్ నుంచి 2లక్షల 92వేల క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు. విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపివేశామన్నారు. రిజర్వాయర్‌లో 74.82 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.061 క్యూసెక్కుల నీటికి సమానమన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు శిబిరం



దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పెదకూరపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడు జడ్పీ హైస్కూల్‌లో సోమవారం నియోజకవర్గ స్థాయిలో సదరు విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని బ్రహ్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో అధికారులు ఏకుల ప్రసాదరావు, పీ సత్యనారాయణ, హెచ్‌ఎం కాకాని వెంకటరమణ, గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, ఐఈడీ కో-ఆర్డినేటర్ సెల్వరాజు తదితరులు పాల్గొన్నారు.

20న పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాల పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూగ, చెవిటి విద్యార్థులకు, శారీరక వికలాంగులకు ఆర్థోపెడిక్ వైద్యులు, కంటి సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎం ఈఓ తెలిపారు. వైద్యశిబిరానికి వ చ్చేవారు 2 ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, యు డీఐడీ కార్డు, బ్యాంకుఖాతా బుక్ జిరాక్సులు తీసుకురావాలని, సందేహాలు వుంటే 89785 80789 నెంబరును సంప్రదించాలని కోరారు.

బెల్లంకొండలో వాహనాల తనిఖీ

బెల్లంకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలా వాహనం నడిపిన వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహన దారులకు తప్పనిసరిగా హెల్మెట్ ఉండాలని సూచించారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు అపరాధ రుసుం వసూలు చేశారు. తనిఖీల్లో సిబ్బంది ఎల్ వెంకటేశ్వరరావు, షణ్ముక్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల మార్కెటింగ్ సొసైటీ గోడౌన్‌లో నిల్వవున్న ఎరువుల బస్తాలు

ఆర్‌ఎస్కేలకు.. ఎరువుల సరఫరా ఎప్పుడు!?

గ్రామాల్లో రైతుల ఇబ్బందులు

పిడుగురాళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా ఇప్పటికీ జరగలేదు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో పల్నాడులోని గురజాల, మాచర్ల ప్రాంతాల్లో మెట్ట భూముల్లో గత నెలలోనే పత్తి సాగు చేయగా, వచ్చే నెల మొదటి వారంలోగా మిరప నారు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మిగిలిన మాగాణి భూములలో గత పది రోజులుగా రైతులు వరినాట్లు వేయడం ముమ్మరంగా సాగించారు. బోర్లు, బావులు ఉన్న మాగాణి భూముల్లో 20 రోజుల క్రితమే వరినాట్లు వేయగా సాగర్ ఆయకట్టు పరిధిలో కొద్దిరోజులుగా వరినాట్లు సాగుచేయడం రైతులు వేగవంతం చేశారు.

ఎప్పుడు వస్తాయో..

పల్నాడు ప్రాంతంలో గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో సుమారు 108 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. సుమారు 25 వేల హెక్టార్లకు పైగా మాగాణి భూములుండగా ఇప్పటికే 11 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. కానీ, ఆయా రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా ఎరువు చేరలేదు. దీంతో రైతులు వరి నాట్లు వేసినా సకాలంలో ఎరువులు చల్లేందుకు అందు బాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతు న్నారు. సమీప పట్టణాల్లోని ప్రైవేటు ఎరువుల దుకాణాలు, మన గ్రోమోర్ సెంటర్లు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులు, పురుగు మందుల విక్ర యాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రాకపోవడంతో.. మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అద నపు బాడుగ ఖర్చు భరిస్తున్నారు. మార్క్‌ఫెడ్ కేంద్రాలలో డీఏపీ, 20-20-20, 10-26-10, 28-28-28 రకాల ఎరువులు మాత్రమే అందుబాటులో వున్నా యి. పల్నాడు ప్రాంతంలో వరితో పాటు పత్తి, మిరప, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులలో ఎక్కువ మంది గోదావరి కంపెనీ యూరియానే అడుగుతున్నారు. ప్రైవేటు దుకాణాలకు అంతగా సరఫరా లేకపోవడంతో డిమాండ్ తలెత్తుతోంది.

డ్రెయిన్ల పారుదల కాక రైతుల అవస్థలు

అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

పారేదెలా..

గుర్రపుడెక్క తొలగేదెలా..!

రేపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రకటనలు ఆర్భాటాలేనని మరోసారి రుజువైంది. రేపల్లె నియోజకవర్గంలో ప్రధాన డ్రెయిన్‌లు తూటికాడ, జమ్మిగడ్డి ఏపుగా పెరిగి మురుగు నీరు పారుదల లేక.. పంట పొలాల్లో వర్షపునీరు తిష్టవేయడం ఇందుకు అద్దం పడుతోంది. వైసీపీ ప్రభుత్వంలో కనీసం డ్రెయిన్లను పట్టించుకున్న పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. అధికారులకూ రైతులు సమస్యలను విన్నవించుకున్నా.. పట్టించుకున్న దాఖలాలు లేవు. డ్రెయినేజీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా.. కార్యాలయం వద్ద ధర్నా చేసిన కనీస స్పందన లేదంటూ మునుసుబువారిపాలెం, రేపల్లె, ఉప్పూడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె మండలంలోని పెనుమూడి, అరవపల్లి, గుడ్డికాయలంక, నగరంమండలంలో గంగోలు, మంగళగుంట, తోటపల్లి ఎక్స్టెన్షన్, చెరుకుపల్లి మండలం గూడవల్లి మెయిన్, కావూరు, నిజాంపట్నం మండలం కూచినపూడి, అడవులదీవి, నిజాంపట్నం డ్రెయిన్లలో ఏపుగా గుర్రపుడెక్క పెరిగిపోయింది. ఈ డ్రెయిన్ల కింద సుమారుగా 70 ఎకరాలు పైనే వరి సాగు చేస్తున్నారు. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాల కారణగా డ్రెయిన్‌లో మురుగు పారుదల కాక పంట పొలాల్లోనే వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వేసిన వరినాట్లు మునిగిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలు బీడుగా మారిపోతున్నాయంటూ వేలాది రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి సారించి పూడికతీత చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



గుడ్డికాయలంక డ్రెయిన్‌లో ఏపుగా పెరిగిన జమ్మిగడ్డి, గుర్రపుడెక్క

బండారుపల్లి సొసైటీ అధ్యక్షుడి నియామకంలో వివాదం

● ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదన్న టీడీపీ శ్రేణులు ● సొసైటీ ఎదుట ఆందోళన చేసిన నాయకులు ● వాయిదా పడిన ప్రమాణస్వీకారం



బండారుపల్లి సొసైటీ ఎదురుగా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

తాడికొండ(బండారుపల్లి)ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండారు పల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడి నియామకంలో టీడీపీలోని వర్గ విబేధాలు బయటపడ్డాయి. బండారుపల్లి సొసైటీకి అధ్యక్షుడిగా గుంటుపల్లి పానయ్యను నియమించినట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో పానయ్య సోమవారం సొసైటీ అధ్యక్షుడి బాధ్యతలు స్వీకరించటానికి సిద్దపడ్డారు. ఈ క్రమంలో టీడీపీలోని మరో వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సొసైటీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం చేస్తే ఉపేక్షించేది లేదంటు టీడీపీ శ్రేణులు సొసైటీ వద్ద ఆందోళనలు చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడి నియమాకంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలను సంప్రదించకుండానే పదవులు కట్టబెట్టారంటూ విషయం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వద్దకు ఆదివారం చేరింది. నామినేటెడ్ పదవులు ఇచ్చేటప్పుడు పార్టీ కోసం 40 ఏళ్ల నుంచి కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులకు కనీస సమాచారం ఇవ్వకుండానే పదవులు పందేరం చేస్తున్నారని వాపోయారు. సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఒప్పుకోమని, స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపిన తరువాతే సొసైటీ అధ్యక్షుడిని నియమించాలని కేంద్ర మంత్రి కార్యాలయంకు తెలియజేశారు. అయితే సోమవారం ఉదయం 10 గంటలకు సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించాలని గుంటుపల్లి పానయ్య వర్గం నిర్ణయించుకుంది. విషయం తెలిసిన మరో వర్గం నాయకులు,కార్యకర్తలు సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు తమపై కేసు పెట్టించి, జైలుకు పంపిన వ్యక్తికి సొసైటీ ఛైర్మన్ పదవి ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 20 లక్షల పెట్టి పదవిని కొనుకున్నారని గ్రామంలో ప్రచారం జరుగుతుందని తెలిపారు. మా ఎమ్మెల్యే డబ్బులు తీసుకునే వ్యక్తి కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందుబాటులో లేరని, వారితో మాట్లాడిన తరువాత మాత్రమే ప్రమాణ స్వీకారం చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఇరువర్గాలతో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధుసూదనరావు చర్చలు జరిపి ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వెయించారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అయితే టీడీపీలో రెండు వర్గాల మధ్య వివాదం జరుగుతుందనే సమాచా రంతో ముందుస్తుగా గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీ శేషయ్య, సొసైటీ మాజీ ఛైర్మన్ దండమూడి సాంబశివరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు మానుకొండ శివరామకృష్ణ, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షులు దండమూడి వెంకట్రావు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్లలో అనర్హుల గుర్తింపు

సర్వేంద్రియాల్లో.. వైకల్యం బయట పడింది

- పల్నాడులో 3,217 మందికి నోటీసులు
- ప్రత్యేక సర్వేలో గుర్తించిన ప్రభుత్వం
- అర్హతుంటే 30 రోజుల్లో అప్పీలుకు అవకాశం



సత్తెనపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా పెన్షన్‌లు ఇచ్చేశారు. కొందరు వైద్యులను ప్రసన్నం చేసుకొని.. ఒత్తిడి తెచ్చి సదరన్ సర్టిఫికెట్లు పొందారు. ప్రస్తుతం దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్న వారికి కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్‌ల సొమ్మును పెంచింది. దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేల పింఛను చేసింది. మరో వైపు మంచానికే పరిమితమైన వారికి ఫెన్షన్‌ను రూ.10వేలు నుంచి రూ.15 వేలకు పెంచింది. గత ప్రభుత్వంలో అనర్హులు కూడా పెన్షన్లు పొందుతున్నారని ఫిర్యాదులు అందాయి. ఎక్కువగా వైసీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు ఇటువంటి పింఛన్లు పొందిన వారిలో ఉన్నారు. అనర్హులకు లబ్ధి చేకూరుతుందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం దీనిపై సర్వే చేపట్టింది. అనర్హులుగా కొంత మందిని వైద్య బృందం సర్వే చేసి గుర్తించింది.

3,217 మంది అనర్హులు..

పల్నాడు జిల్లా వ్యాప్తంగా 35,542 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 3,217 మందిని అనర్హులుగా గుర్తించి సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 6 నుంచి 31వ తేదీ వరకు పింఛన్‌ల వెరిఫికేషన్ చేశారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక సద రన్ క్యాంపులు ఏర్పాటు చేసి.. వారి సర్టిఫికెట్లు కరెక్టుగా ఉన్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలించారు. అనర్హులను గుర్తించి.. సచివాలయాల వారీగా నోటీసులు జారీ చేస్తున్నారు. మరోసారి సదరన్ సర్టిఫికెట్ చేయించుకొని రావాలని, అప్పుడు పింఛను ఇస్తారని వారికి చెబుతున్నారు. ఇలా అనర్హులకు జూలై నెల పింఛన్ నిలుపుదల చేశారు. నోటీసులు అందుకున్న పింఛనుదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలి

ఈ విషయంపై డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి స్పందిస్తూ.. పల్నాడు జిల్లాలో నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు పాత సదరన్ సర్టిఫికెట్, తాజాగా అందిన నోటీసు తీసుకొని ఏరియా వైద్యశాలకు వెళ్లి సంబంధిత డాక్టర్‌తో పరీక్ష చేయించుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న ప్రొఫార్మాలో మాన్యువల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. నోటీసులు అందుకున్న వారంతా 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలని ఆమె సూచించారు.

పింఛన్లలో.. మార్పులు

దివ్యాంగత్వం 85 శాతానికి పైబడి ఉండి మంచానికే పరిమిత మైన వారికి రూ15వేలు, అంత కంటే తక్కువ 40 శాతం కంటే ఎక్కువ ఉంటే మెడికల్ పింఛన్ నుంచి రూ.6 వేలకు మార్పు చేస్తున్నారు. 40 శాతానికి కంటే అంగవైకల్యం తక్కువగా ఉండి 60 సంవత్సరాల పైబడి ఉంటే రూ.4 వేలు వృద్ధాప్య పింఛన్‌కు బదిలీ చేస్తారు. 60 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉంటే పింఛన్ తొలగి స్తారు. 40 శాతం కంటే ఎక్కువ దివ్యాంగత్వం ఉంటే రూ.6వేలు పింఛన్ యథావిధిగా మంజూరు చేస్తారు.

పెరిగిన ప్రయాణాలు

విజయవంతంగా స్త్రీ శక్తి పథకం

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో జీరో ఫేర్ టిక్కెట్ల జారీలే అత్యధికం

45 నుంచి 60 శాతానికి పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ



కిక్కిరిసిన బస్సులో తోచుకుంటూ ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు



గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల కోలాహలం

గుంటూరు, తెనాలి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంపై మహిళల్లో సంతోషాన్ని నింపుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా సాగుతోంది. రోజురోజుకు మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోన్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఇబ్బంది ల్లేకుండా పథకం అమలు జరుగుతోందని నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్ తెలిపారు.

45 నుంచి 60 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ

స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 45 నుంచి 60 శాతానికి మహిళా ప్రయాణీకుల ఆక్యుపెన్సీ పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పథకాన్ని ప్రారం భించిన తొలి రోజు ఈనెల 15న విభజిత గుంటూరు జిల్లాలో 4800 మంది మహిళా ప్రయాణీకులు వారి వారి గమ్యస్థానాలకు చేరుకున్నా రని, పల్నాడు జిల్లాలో 5,293 మంది మహిళా ప్రయాణీకులు సద్విని యోగం చేసుకొన్నారని, బాపట్ల జిల్లాలో 4200 మంది జీరో ఫేర్ టిక్కెట్ల తో ప్రయాణించారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలానే మూడో రోజు 17వ తేదీకి మహిళా ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళా ప్రయాణీకుల సంఖ్యే అత్యి ధికంగా ఉంటోందని చెబుతున్నారు. మూడో రోజున గుంటూరు జిల్లాలో 90 వేల మంది మహిళా ప్రయాణీకులు కాగా, పల్నాడు జిల్లాలో లక్షా 10వేల మంది, బాపట్ల జిల్లాలో 55 వేల మంది మహిళా ప్రయాణీకులు జీరో ఫేర్ టిక్కెట్‌తో ప్రయాణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఫలించిన ముందస్తు ప్రణాళికలు....

స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో అధికారుల ముందస్తు ప్రణాళికలు సత్ఫలితాలనిస్తున్నాయని చెబుతున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది ల్లేకుండా పథకం అమలు జరుగుతోందని చెబుతున్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ఫుట్ బోర్డు విస్తరణ, లోపల నిల్చొన్న మహిళలు పట్టుకునేలా హ్యాండిల్ స్లింగ్స్, అత్యవసర ద్వారం వంటి ఏర్పాట్లు చేశారు.

కొరవడిన పర్యవేక్షణ

సోమవారం తెనాలి పాత బస్టాండ్ వద్ద బస్సులు నిలిపే సమయంలో వందల సంఖ్యలో మహిళలు బస్సుల కోసం బారులు తీరి ఉన్నారు. ప్రతి పదినిముషాలకు ఒక బస్సు వస్తున్నా ఆయా బస్సులలో మహిళలతో కిక్కిరిసి ఉంటున్నారు. ఈ క్రమంలోనే పాత బస్టాండ్ వద్దకు బస్సు రాగానే అందులో ఎక్కి ప్రయాణం చేసేందుకు మహిళలు పోటీపడ్డారు. ఈక్రమంలో ఓ వృద్ధుడు బస్సు ఎక్కుతుండగా తోపులాట చోటుచేసుకుని కిందపడిపోయాడు. సమీపంలోని మహిళలు అతడిని పైకిలేపి సపర్యాలు చేశారు. గతంలో ఆ ప్రాంతంలో ప్రయాణీకులను ఎక్కించేందుకు ఆర్టీసీ డిపోకి చెందిన పలువురు అధికారులను, సిబ్బందిని నియమించేవారు. వారు బస్సును నిలపుదల చేయడం, ప్రయాణీకులు ఎక్కిన తరువాత పంపించడం వంటివి చేసేవారు. ప్రస్తుతం అటువంటి వారు కనబడటంలేదు. ఫలితంగా బస్సు ఎక్కేసమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరిగిన బస్సు ప్రయాణీకులకు తగ్గట్టుగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రయాణీకులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణానదికి పెరిగిన వరద ప్రవాహం

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం శ్రీశైలం నుంచి 3,31,699 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.80 అడుగులు ఉంది. ఇది 299.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006, ఎడమ కాలువ ద్వారా 4949, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, 8 క్రస్ట్ గేట్లను 10 అడుగులు, 18 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,51,182 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,93,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

తీర గ్రామాల్లో అప్రమత్తం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణానదికి వరద ఉధృతి పెరిగింది. గత కొన్ని రోజులుగా కృష్ణానదికి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల నీరు రావటంతో నదీ తీర గ్రామాలన్నీ అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మత్స్యకారుల వేట పూర్తిగా స్తంభించి పోయింది. తీర గ్రామాల్లోని మత్స్య కారులు వారి పడవలను ఒడ్డుకు చేర్చుకొని నిత్యం కాపలా కాస్తు న్నారు. వరద ఉధృతి రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. నదీ తీర గ్రామాలు ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పులి చింతల ప్రాజెక్టులో సోమవారం 38.17 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,31,641 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసె క్కులు, తొమ్మిది గేట్ల ద్వారా 2,64,807 క్యూసె క్కులు, మొత్తం 2,81,807 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల పడవలు



అరవింద వారథి వద్ద పెరిగిన వరద ప్రవాహం

కొల్లూరు ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అల్ప పీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల వల్ల.. కృష్ణానది పరీవాహక ఎగువ ప్రాంతం నుంచి భారీ వరద నీరు కృష్ణా నదికి చేరుతోంది. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఆదివారమే అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కూడా రద్దు చేసి వరదల పట్ల అప్రమత్తం కావాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేటి నుంచి స్పెషల్ ఆధార్ క్యాంప్‌లు

వినుకొండటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ కాలనీ-1, ఓబయ్యకాలనీ సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్‌కు సంబంధించిన సర్వీసులను అందిస్తామని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

- కలెక్టర్ పీ అరుణ్‌బాబు
- పీజీఆర్‌ఎస్‌లో 141 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో అందిన అర్జీల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన అర్జీలను కలెక్టర్ పీ అరుణ్‌బాబు స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌లో 141 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసు కోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళీ, ఆర్డీవో ఎం మధులత, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

శావల్యాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య సోమవారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పకుండా హాజరై గ్రామాల్లోని ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖల్లోని సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

ప్రజా గ్రీవెన్స్‌లో మూడు ఫిర్యాదులు

రొంపిచర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం జరిగిన ప్రజా గ్రీవెన్స్‌లో మూడు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. రొంపిచర్ల, తురుమెళ్ళ, అన్నవరం గ్రామాలకు సంబంధించిన భూ ముల్లో వ్యత్యాసం, ఆన్‌లైన్‌లో నమోదు కో^సం దరఖాస్తులు వచ్చినట్టు ఆమె తెలిపారు. సంబంధిత దరఖాస్తులను ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

టీడీపీ రెండు కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

చిలకలూరిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలో భాగంగా నియోజకవర్గ లీగల్ సెల్, విభిన్న ప్రతిభావంతుల విభాగం కార్యవర్గాలను పార్టీ కార్యాలయంలో సోమవారం శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లీగల్ సెల్ కమిటీ అధ్యక్షులుగా గంజినబోయిన శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాటి వీరయ్య, విభిన్న ప్రతిభావంతుల విభాగం అధ్యక్షులుగా బాణవత్ శివా నాయక్, ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లి చిన్న అప్పయ్యలు ఎన్నికయ్యారు.

కరాటే పోటీల్లో పేట విద్యార్థి ప్రతిభ

చిలకలూరిపేట, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పర్వత రెడ్డి ఆనంద్ మిని స్టేడియంలో సిద్ధార్థ కరాటే అకాడమీ వారి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 43వ జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో స్థానిక జీవీ ఐఐటీ పాఠశాల విద్యార్థి సాతర్ల మను ప్రీత్ సాయి కటా విభాగంలో తృతీయ స్థానాన్ని సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ పారేపల్లి ఉదయ్ కుమార్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణి కుమార్, కరాటే ఉపాధ్యాయుడు బీ రాజు విజేతను అభినందించారు.

కస్తూర్బా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

చిలకలూరిపేట, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరంలోని కస్తూరిబా పాఠశాలలో టెన్త్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో జరిగీన కార్యక్రమంలో ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేశారు. క్లబ్ మాజీ అధ్యక్షురాలు కారుమంచి సరళదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త కారుమంచి శివరావు ఈ మొత్తాలు ఇచ్చారు. 95 శాతం మార్కులు పైగా వచ్చిన నలుగురు విద్యార్థినులకు రూ.5వేలు, 90 శాతం పైగా వచ్చిన ఒక విద్యార్థినికి రూ.3వేలు, 85 శాతం పైగా వచ్చిన 7 మంది విద్యార్థినులకు రూ.2 వేలు చొప్పున, మొత్తం 37 వేల రూపాయలు శివరావు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు నార్నే జయలక్ష్మి, కార్యదర్శి చెన్నుపాటి చైతన్య, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు పాల్గొన్నారు.


హోమ్ గార్డుకు మాజీ ఎమ్మెల్యే సహాయం

చిలకలూరిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరి పేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డు విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మానం శ్రీనివాసరావుకు చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ళ జయమ్మ సోమవారం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. స్థానిక పండరీపురంలోని హోంగార్డు గృహానికి వెళ్ళి ఆయనను పరామర్శించి ఈ సహాయాన్ని ఆమె అందజేశారు.









నేడు మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

రొంపిచర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రొంపిచర్ల మార్కెట్ యార్డు పాలక వర్గం నేడు నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని గాడిపర్తి సురేష్, పులుకూరి జగ్గయ్య, మొండితోక రామారావు తెలిపారు. యార్డు చైర్మన్‌గా మొండితోక రాణి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

కాపు సంఘీయులకు సన్మానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాపు సంఘం నాయకుడు యతిరాజు రామ్మోహన్‌రావు తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆవుల సుబ్బారావు కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో నామినేటేట్ పదవులు పొందిన కాపు సంఘీలకు ఘనంగా సన్మానం జరిగిందని శ్రీకృష్ణదేవరాయ కాపుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంచాల వెంకట తిరుపతిరావు సోమవారం తెలిపారు. నియోజకవర్గ శ్రీకృష్ణదేవరాయలు కాపుసంఘం అధ్యక్షుడు పోతుల శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కాసా ఆంజనేయులు, జొన్నలగడ్డ సొసైటీ డైరెక్టర్ ముప్పాళ్ళ నరసింహారావు, భువనచంద్ర టౌన్ హాల్ సభ్యులు దమ్మవళం ఏడుకొండలు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపాల ఫణి, సంఘం జాయింట్ సెక్రటరీ వెలిదండి శివలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యతిరాజు రామ్మోహన్‌రావు, మంచాల వెంకట తిరుపతిరావు, యతిరాజు రామ్మోహన్‌రావు, దామ శ్రీనివాసరావు, రాయల శ్రీనివాసరావు, రామిశెట్టి సుబ్బారావు, మోహన్‌రావు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు కోసం మహిళల్లో గందగోళం



ఉచిత బస్సు అనుమతి లేకపోవడంతో ఎక్కి కిందకు దిగిన మహిళలు

వినుకొండటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకునేందుకు మహిళలు సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో బారులు తీరారు. కృష్ణాష్టమి సందర్భంగా శని, ఆదివారాలు సెలవుల అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో పట్టణానికి చేరుకొని ఆర్టీసీ బస్సుల ద్వార వ్యక్తిగత పనులపై గుంటూరు, నరసరావుపేటతో పాటు మార్కాపురం వైపు వెళ్లేందుకు బారులు తీరారు. వినుకొండ ఆర్టీసీలో ఏపి బస్సుకు ఉచిత అవకాశం ఉంది అనే బ్యానర్ లేకపోవడంతో కొందరు ఆల్ట్రా ఎక్స్‌ప్రెస్‌లను ఎక్కి కిందకు దిగాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ డీఎం మహిళలకు ఏపి బస్సుల్లో స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణానికి అవకాశం ఉండో పోస్టర్ ఏర్పాటు చేయాలని మహిళలు వాపోతున్నారు.

టీడీపీ నేత వేధింపులు భరించలేక స్కూల్ డైరెక్టర్ ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట రూరల్, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నేత వాసిరెడ్డి రవి వేధింపులు భరించలేక ఓ ప్రైవేట్ స్కూల్ డైరెక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బాధితుడి భార్య హేమలత తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తాము ఒక పాఠశాల నడుపుతున్నామని దానికి అగ్రిమెంట్ పీరియడ్ అయిపోయిందని ఈ నేపథ్యంలో తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. అయినా వాసిరెడ్డి రవి అతని అనుచరులతో అర్ధరాత్రి పాఠశాల మెయిన్ గేటుకు అడ్డంగా గోడ కట్టించాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో భయాందోళనకు లోనైన తన భర్త బషీర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆమె తెలిపారు. ఈ మేరకు తాను రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశానని కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

26వ వార్డులో వీధి కుక్కల స్వైర విహారం

● నలుగురు పిల్లల్ని కరిచిన తీరు


చిలకలూరిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 26వ వార్డులో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రెండు రోజుల్లో ఈ వార్డులో నలుగురు పిల్లల్ని కుక్కలు కరిచాయి. వీరంతా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రాబీస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. పిల్లల్ని వీధి కుక్కలు కరవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వీధి కుక్కలు సమస్యను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని వారు కోరారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబుకు సత్కారం

చిలకలూరిపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రాన్ని అందుకున్న చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబును సోమవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేనేజర్ మొహిద్దీన్, ఆర్వో సుబ్బారావు, డీఈ రహీమ్, మున్సిపల్ ఏఈలు అన్సర్, అల్తాఫ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమణారావు, సునీత పాల్గొన్నారు.

బొమ్మ పోయింది.. రాజ ముద్ర వచ్చింది

● రీ సర్వే గ్రామాలకు పాసు పుస్తకాలు



రాజముద్రతో జారీ అయిన పాసు పుస్తకం



నాడు మాజీ సీఎం జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకం

బొల్లాపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : భూమి రైతుది. దాని పట్టాదారు పాసు పుస్తకం రైతుదే. కాని దానిపై ఫొటో మాత్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. జగన్ బొమ్మతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ముద్రించి రైతులకు అందించారు. పాసు పుస్తకం చూసినప్పుడల్లా రైతులు ఆగ్రహించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాసు పుస్తకాలపై ఎటువంటి బొమ్మలు ప్రచురించకుండా ప్రభుత్వ రాజముద్రను వేయించి పాసు పుస్తకాలను జారీ చేశారు. మండలంలోని బొల్లాపల్లి, వెల్లటూరు, పేరూరుపాడు, సరికొండపాలెం గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుంది. పూర్తయిన భూముల వివరాలతో కూడిన పాసు పుస్తకాలు ఇచ్చారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేయటంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు 86 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 86 ఫిర్యాదులు అందాయి. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరగా పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన షేక్ రబ్బాని, వినుకొండ పట్టణానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్, నరసరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌బాషా అను ముగ్గురు జాబ్ కోసం హైదరాబాదు వెళ్లగా అక్కడ షేక్. జబ్బర్ అనే వ్యక్తి ద్వారా కాసరగడ్డ నరేంద్ర అను అతను పరిచయమై ఐటీ జాబ్స్ ఇప్పిస్తానని నగదు తీసుకొని మోసం చేశాడని న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. వినుకొండ పట్టణానికి చెందిన తోటఅజయ్‌కు గోద్రెజ్ ప్రాపర్టీస్‌లో జాబ్ అని చెప్పి తన వద్ద 35 లక్షల 50 వేలు నగదు తీసుకొని సదరు సంస్థ వారు తనను మోసం చేశారని.. న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు. యడ్లపాడు గ్రామానికి చెందిన దొప్పలపూడి శ్రీకాంత్, కొంత మంది రైతులు యడ్లపాడు యూనియన్ బ్యాంక్ నందు బంగారం తాకట్టు పెట్టి వ్యవసాయ రుణం తీసుకున్నట్లు, బ్యాంకు నందు గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తున్న నిడమానూరు హరీష్ అను అతను ఫిర్యాదు చేత బంగారం రెన్యువల్ అని చెప్పి ఫిర్యాదుకు తెలియకుండా పత్రాల మీద సంతకాలు చేయించుకొని తమతో పూర్తిగా నగదు చెల్లించుకుని తమకు తెలియకుండా మరల తమ పేరుపై నకిలీ బంగారం తాకట్టు పెట్టి లోను తీసుకున్నారని, సదరు విషయమై బ్యాంకు అధికారులు పసిగట్టి వారిపై కేసు నమోదు చేశారని పూర్తిగా నగదు చెల్లించిన తమ ఒరిజినల్ బంగారం తమకు ఇప్పటివరకు ఇవ్వలేదని తగు న్యాయం చేయవలసిందిగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నరసరావుపేట యోగయ్య నగర్‌కు చెందిన డ్వాక్రా సురక్ష మహిళ పొదుపు గ్రూపు నందు ఉన్న పది మంది సభ్యులకు పది లక్షల రూపాయల లోన్ తీసుకున్నట్లు, గ్రూప్ లీడర్ అయిన జాన్‌బీకి ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల సెకండ్ లీడర్ అయిన సుజాతకి ప్రతి నెల తొమ్మిది మంది సభ్యులు కలిసి పూర్తి నగదు చెల్లించారు.. కానీ ఆమె తన సొంత ప్రయోజనాలకు వాడుకొని బ్యాంకులో జమ చేయలేదని తాము సదరు విషయం ప్రశ్నించగా తమపై దాడి చేసి బెదిరిస్తుందని న్యాయం చేయవలసిందిగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌లో క్రైమ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో నిధుల దోపిడీ

నాదెండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు అందించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను దోపిడీ చేశారని టీడీపీ పల్నాడు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు వేముల బాలరాజు పేర్కొన్నారు. నిజమైన విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వం తొలగిస్తుండగా వైసీపీ వారు దుష్ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రచారాలను దివ్యాంగులు నమ్మరని ఆయన వివరించారు.

విప్పర్లలో శ్రీ కృష్ణ భగవానుడి ఊరేగింపు

రొంపిచర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విప్పర్ల గ్రామంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు కార్యక్రమం సోమవారం వైభవం గా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పుర వీధుల్లో కోలాట ప్రదర్శన నిర్వహించారు. త్రైత సిద్ధాంత, హిందూ ధర్మ ప్రచార పరిషత్ విప్పర్ల, చిలకలూరిపేట ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామస్థులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

నూజెండ్ల,ఉల్లగల్లు మార్గానికి మోక్షం ఎప్పుడో?



నూజెండ్లలో గుంతలమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు

నూజెండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ - ఉల్లగల్లు మార్గంలో ఉప్పలపాడు నుంచి నూజెండ్ల వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రతి నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయి తీవ్ర గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. నూజెండ్ల, ఉప్పలపాడు గ్రామాల్లో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవటంతో మురుగు నీరు, వర్షపు నీరు రోడ్లపై నిలిచి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ మార్గంలో సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి ప్రయాణం సాఫీగా జరిగే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పాత ఉప్పలపాడులో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన నిలిచిన మురుగు నీరు

కోటి రూపాయలతో మరమ్మతులు

● ఏఈ నవ్య

నూజెండ్ల నుంచి ఉప్పలపాడు వరకు 14కిలో మీటర్ల మేర రెండు కిలో మీటర్లు పూర్తిగా తారు రోడ్డు పునఃర్నిర్మాణం, మిగిలిన చోట ప్యాక్స్ వర్క్‌లు, మెయిన్‌టైన్స్ చేసేందుకు కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయని, టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పనుల వివరాలు తెలియజేశామని, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్న వెంటనే పనులు మొదలు పెడతామని ఏఈ నవ్య తెలిపారు.

కోర్టు ఆవరణలో దంత వైద్య శిబిరం

నరసరావుపేట లీగల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టు భవనాల ఆవరణలో సోమవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించినట్లు న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో తేజశ్రీ డెంటల్ వైద్యశాల వైద్యులు న్యాయవాదులకు కోర్టు సిబ్బందికి దంతాలకు సంబంధించిన సమస్యలపై ఉచితంగా పరీక్ష నిర్వహించారు. మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రసాదు మాస్టారు

నూజెండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతారామపురం శ్రీ వెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పీఎస్ఆర్‌కే ప్రసాదు గ్రామంలోని 15 మంది వృద్ధులకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా హెచ్ఎం కామేశ్వరరావుశర్మ మాట్లాడుతూ పేదలకు సహాయ సహకారాలు అందించటం అభినందనీయమన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి గాయాలు

వినుకొండటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన పట్టణంలోని శృంగారపువనం ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే కురిచేడు మండలం దేకనకొండ గ్రామానికి చెందిన సోమవరపు బాబు బహిర్భూమికని వెళ్లగా ప్రమాదవ శాత్తు రైలు ఢీకొని గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం, బంధువుల సాయంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి మెడలో గొలుసు చోరీ

వినుకొండటౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి మెడలో బంగారపు గొలుసు లాక్కున్న సంఘటన పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని నారాయణ పాఠశాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. బొల్లాపల్లి మండలం పేరూరుపాడు గ్రామానికి చెందిన వలి అనే వ్యక్తి, మరో యువకుడితో నడుచుకుంటూ వెళ్తుండగా గమనించిన దొంగలు మెడలో బంగారపు గొలుసు లాక్కొని పరారైనట్లు బాధితులు తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామకమిటీలు

శావల్యాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామాల్లో నూతనంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాలతో వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు, చిన్నకంచెర్ల గ్రామాల్లో వైసీపీ గ్రామకమిటీ ఎన్నికలు నిర్వహించారు. పోట్లూరు గ్రామ అధ్యక్షుడిగా వల్లూరి శ్రీనివాసరావు, చిన్నకంచెర్ల అధ్యక్షుడిగా పూరేటి బ్రహ్మంలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు గ్రామాల్లో కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు.

నిజాయితీ, నిబద్ధతకు పట్టం

● యడ్లపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మద్దినేని

● సభ్యులుగా మిరియాల, ఇనగందుల

● బాధ్యతలు స్వీకరించిన త్రిసభ్య కమిటీ



మద్దినేని వెంకట సుబ్బారావు (ఫైల్)

యడ్లపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీ, నిబద్ధతకు ఆయన మారుపేరు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగారు. వ్యాపారవేత్తగా విజయాలు సాధించిన ఆయన మంచి పరిపాలనా దక్షుడిగా, నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా నిలిచారు. ఐదేళ్ల గ్రామ సర్పంచ్‌గా, రెండున్నర దశాబ్దాలపాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) అధ్యక్షుడిగా పనిచేసినా ఇసుమంత గర్వం ఆయనలో ఎక్కడా కనిపించదు. ఆయనే యడ్లపాడు మండలం సందెపూడి గ్రామానికి చెందిన మద్దినేని వెంకట సుబ్బారావు. పదవి ఏదైనా ప్రజా సేవ చేయడమే తన ధ్యేయమంటారు. తెలుగుదేశంపార్టీ స్థాపించక ముందు సందెపూడి గ్రామసర్పంచ్‌గా ఐదేళ్ళు పాలన సాగించిన ఆయన గ్రామాభివృద్ధికి ఎంతో కృషిచేశారు. 1983లో టీడీపీ స్థాపించిన తరువాత పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. 1995లో యడ్లపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన 2019వరకు రెండున్నర దశాబ్దాల పాటు అధ్యక్షుడిగా కొనసాగారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా త్రిసభ్య కమిటీలను నియమించి సొంత పార్టీవారికి పాలన అప్పగించింది. తిరిగి 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఇటీవల సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వస్తోంది. గతంలో సుబ్బారావు చేసిన సేవలను గుర్తుంచుకున్న ప్రభుత్వం చైర్‌పర్సన్‌గా వెంకట సుబ్బారావును పర్సన్ ఇన్‌చార్జిగాను, సభ్యులుగా సొలస కారుచోల గ్రామానికి చెందిన మిరియాల నాగేశ్వరరావు, కొండవీడుకు చెందిన ఇనగందుల వీరాంజనేయులును నియమించింది. సోమవారం వెంకట సుబ్బారావు చైర్‌పర్సన్‌గాను, నాగేశ్వరరావు, వీరాంజనేయులు సభ్యులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారికి పలువురు టీడీపీ నాయకులు సొసైటీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.